ప్రజాశక్తి
శుక్రవారం 1 సెప్టెంబర్ 2023



అరకు గురుకుల క్రీడా పాఠశాలకు ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ క్రీడా దినోత్సవం పుష్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రతిభా అవార్డు అల్లూరు జిల్లా అరకు వ్యాలీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల ప్రథమ స్థానం పొందింది. ఈ మేరకు గురువారం పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ ఈ ప్రతిభ అవార్డును పాఠశాల ప్రధానోపా ధ్యాయులకు అందజేశారు.



ప్రిన్సిపల్‌కు అవార్డును అందజేస్తున్న పిఒ

ఉద్యోగాల భర్తీ ఏదీ?

-హామీలను మరచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు - సిపిఎం సమర భేరిలో నేతలు



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆదివాసీలపై అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని వ్యతిరేకిస్తూ సిపిఎం చేపట్టిన సమర భేరి కార్యక్రమాన్ని అల్లూరి జిల్లాలో ఆ పార్టీ శ్రేణులు గ్రామ గ్రామాన చేపట్టారు. పలు చోట్ల ప్రచారం నిర్వహించిచారు.

ముంచింగిపుట్టు: మండలంలోని జర్రెల గ్రామ పంచాయతీ డేగలుపుట్ గ్రామంలో సిపిఎం సమర బేరిని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సురేంద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందన్నారు. జగన్ ప్రభుత్వం మోడీకి భజన చేస్తూ , బిజెపి ఆదేశాలను ఆంధ్రలో అమలు చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సరుకుల ధరలను తగ్గించాలని, జీవో 3 రిజర్వేషన్ పునర్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి భీమరాజు, కె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి : గంగరాజు

అనంతగిరి: మండలంలోని గురువారం ఎగువ సోభ పంచాయతీ పరీ జాముగుడ గ్రామంలో సిపిఎం ప్రచార భేరి చేపట్టారు. అధిక ధరలు తగ్గించి, స్పెషల్ డిఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేయాలని సీపీఎం జెడ్పీటీసీ గంగరాజు డిమాండ్ డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ చేపట్టారు. కేంద్రంలో మోడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీ గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, పార్టీ కార్యకర్తలు నరాజీ, సురేష్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ఉత్సాహంగా గ్రామాలకు..

పాడేరు: జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సంతల్లోనూ ప్రజల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. జీవో 3 రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలని గిరిజనుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ధరలను నియంత్రించాలని, ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు న్యాయం చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతుల కోసం చేసిన తీర్మానాలను రద్దు చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. పాడేరు మండలంలోని గుర గరువు గ్రామంలో సిపిఎం సమరభేరిలో పార్టీ నాయకులు పాలికి లక్కు, ఎల్ సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

పాడేరు: వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ చెరువుల వనంలో సంతకాల సేకరణ, గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు మర్రి నాగేంద్రబాబు, సత్తిబాబు, చంటిబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



రాజఒమ్మంగిలో సంతకాల సేకరణ

దుంబ్రిగుడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అరకు సంత బయలు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, జీవో 3కు చట్టబద్ధత కల్పించి ఆదివాసి స్పెషల్ డిఎస్సి వెంటనే విడుదల చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆ పార్టీ మండల నాయకులు పి.సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పి.డుంబు, పి.మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: **మండలంలోని** అడుగులు పుట్టు పంచాయితీ సంపంగిపుట్టు, తోరంగుల్ గ్రామాల్లో సిపిఎం సమర బేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్నిబాబు, నాయకులు ధర్మన్నపడాల్ మాట్లాడుతూ, ఈనెల 4 వరకు వివిధ రూపాల్లో సిపిఎం నిర్వహిస్తున్న పోరాటాల కు ప్రజలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బొండా గంగాధరం, జె. సునీల్ కుమార్, గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు: సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ పరిధి జోడిమామిడి, నిమ్మలపాలెం, తులబడ గ్రామాల్లో సిపిఎం నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం డౌనూరు శాఖ కార్యదర్శి టి.చిట్టిబాబు, నాయకులు టి.ప్రసాదు, అప్పారావు, పౌలు మల్లేశ్వరరావు, ప్రవీణ్, నవీన్ నాయుడు, బాబ్జి, జాను తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం నాయకులు మండలంలోని రాజుపేట, రేఖపల్లి, జీడిగుప్ప పంచాయితీలోని గురువారం కరపత్రాలు పంపిణీ చేసి, సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల రైతుల పొలాలు బీడులుగా మారాయని, చేయడానికి పనులు లేక చదువుకున్న వారికి ఉద్యోగాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, గూటాల శ్రీను, సోడి మల్లయ్య, చంద్రరావు, ప్రకాష్, కదల కొండారెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో సిపిఎం నాయకులు, స్థానిక సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ ఆధ్వర్యాన ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండిపూడి లక్ష్మణరావు, తుమ్మలపల్లి నాగేశ్వరావు, ఆత్మకూరు కాంతారావు, నాళ్ళారపు చందర్రావు, దారోగి బాబురావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : నిరుద్యోగం, అధిక ధరలు, పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా రాజవొమ్మంగిలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొండ్ల సూరిబాబు, పి.రామరాజు, టి.శ్రీను మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగు పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



విఆర్ పురంలో...

అటకెక్కిన జాబ్ క్యాలెండర్

-భర్తీ కాని వివిధ శాఖల్లో పోస్టులు
-నిరుద్యోగుల ఆశలపై నీళ్లు
-ప్రత్యేక డిఎస్‌సికి ఎదురుచూపులు
-ఉపాధి లేక ఖాళీగా గిరిజన అభ్యర్థులు



ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్న పాలకుల హామీలు గత కొన్నేళ్లుగా నీటి మూటలుగానే ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువత ఆశలపై నీళ్లు చల్లాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రాకపై ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ ధైర్యం కోల్పోతూ గిరిజన నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సాధారన డిఎస్ సి ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వర్గాలకు చెందిన టీచర్ పోస్టుల నియామకాలు చేపడుతుంది. గిరిజన ప్రాంతంలో అభ్యర్థుల కోసం స్పెషల్ (గిరిజన) డిఎస్‌సిని నిర్వహించి, ఆయా పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేస్తుంది. ఇందులో భాగంగా గిరిజన ప్రాంతంలో 640 టీచర్ పోస్టుల భర్తీకి స్పెషల్ డిఎస్ సి నిర్వహిస్తామని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ-233ని జారీ చేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. తరువాత 2014లో టిడిపి అధికారంలోకి వచ్చి, 2015లో అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రావెల కిషోర్ బాబు గిరిజనుల కోసం స్పెషల్ డిఎస్ సి నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ అమలు చేయలేదు. 2019 ఫిబ్రవరిలో 611 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిఒ-10ని విడుదల చేసి దీనిని అమలు చేసే లోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మరుగున పడింది.

వైసిపి ప్రభుత్వం వచ్చాక వివిధ శాఖలలో వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని నిరుద్యోగులు ఆశించారు. వారి ఆశలపై జగన్ నీళ్లు చల్లడంతో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదంటూ సిఎం కాకముందు ఒక మాట సిఎం అయ్యాక ఒక మాట అని నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతి ఏడాది జనవరి 1న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేస్తామని మొండి చేయి చూపడాన్ని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

మోసగించిన వైసిపి ప్రభుత్వం..

వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులనూ మోసగించింది. ఈ ప్రభుత్వం వచ్చాక వివిధ శాఖల్లో వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని ఆశించాం. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న సిఎం జగన్ మాట తప్పి నిరుద్యోగులను మోసగించారు. క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల్ని భర్తీ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఆదివాసి ప్రాంత నిరుద్యోగులు ఆవేదనకు గురవుతున్నారు. ఏటా నోటిఫికేషన్ లు వస్తే అభ్యర్థులపై ఇంత ఒత్తిడి ఉండదు.



కర్జ వైకుమార్
నిరుద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు

స్పెషల్ డిఎస్‌సి జారీ చేయాలి

గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆదివాసి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి. స్పెషల్ డిఎస్‌సి కోసం బిఎడ్, డిఎడ్ పూర్తి చేసిన ఎంతోమంది గిరిజన నిరుద్యోగులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. విలువైన కాలాన్ని వెనక్కి తెచ్చుకోలేం వయస్సు పెరిగేకొద్దీ పరీక్షల సన్నద్ధతపై ఆసక్తి పోతుందని ఎంతోమంది గిరిజన నిరుద్యోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జనరల్ డిఎస్ సి నోటిఫికేషన్ తో పాటు, స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ కూడా జారీ చేయాలి.



వి.మహేశ్వర రావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



108 వాహనంలో ప్రసవం జరిగిన దృశ్యం

108 వాహనంలో ప్రసవం

కవల పిల్లలకు జన్మనిచ్చిన మహిళ

ప్రజాశక్తి-రంపచోడవరం

పురిటినొప్పులు వచ్చిన గర్భిణిని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో వాహనంలోనే ప్రసవించి, కవల పిలులకు జన్మనిచ్చింది. మండలంలోని గోగుమిల్లి గ్రామానికి చెందిన గర్భిణి కుంజం వెంకటలక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కుంజం వెంకన్న దొర 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సకాలంలో చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది వెంకటలక్ష్మిని తీసుకుని రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కి తరలిస్తుండగా, మార్గమధ్యలో పందిరి మామిడి జంక్షన్ సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఇఎంటి మల్లిక, మిగతా సిబ్బంది సహాయం తీసుకుని వెంకటలక్ష్మికి పురుడు పోశారు. వెంకటలక్ష్మి ఆడ, మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. తదుపరి వైద్యానికి వారిని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు ఇఎంటి మల్లిక, పైలట్ కోమలి సతీష్‌కుమార్, ఇతర 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు సంబంధించిన గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరంచవలసిందిగా కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-జి.మాడుగుల

మండల కేంద్రానికి అనుకొని ఉన్న కొత్తూరు గ్రామంలో ఇంటి దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీనివాస్ అందించిన వివరాలు... మృతుడు చేటూరి శివ నాగ వర్మకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. చింతపల్లి గ్రామం నుండి జి.మాడుగుల బతుకు తెరువు కోసం వచ్చి కొత్తూరు గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మెకానిక్ షాప్ లో పని చేస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఒంటిగంట సమయంలో భార్య పిల్లలు నిద్రిస్తుండగా ఇంట్లోనే ఉన్న దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పిల్లలు తెల్లవారు లేచి చూసేసరికి దూలానికి ఉరివేసుకొని ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పౌష్టికాహార వారోత్సవాలను జయప్రదం చేయండి

ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

సెప్టెంబర్ 1 నుండి 7వ తేదీ వరకు పౌష్టికాహార వారోత్సవాలను అంగన్వాడీ సిబ్బంది సక్రమంగా నిర్వహించి జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పౌష్టికాహార వారోత్సవాలు రాజవొమ్మంగి మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని గ్రామాలల్లో రాజకీయ నాయకులు, గ్రామస్తుల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలపై గర్భిణులు, బాలింతలకు వివరించాలని సూచించారు. పర్వత ప్రాంతాలలో నివసిస్తున్న గర్భిణులకు వారి ఇళ్ళకే రేషన్ అందించాలన్నారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు సక్రమంగా అందినది లేనిది పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసిత యువతకు అన్యాయం

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు, ఇళ్లు చివరికి ఊళ్లే త్యాగం చేస్తున్న నిర్వాసితుల కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వ వైఖరి కారణంగా వారి భవిష్యత్ ప్రశ్నార్థకం కానుంది. ఎప్పుడో 2017 సంవత్సరంలో నోటిఫికేషన్ ప్రకారం ఇప్పుడు పరిహారం ఇస్తున్నారు. ఆ ఏడాదినే అర్హుల జాబితాకు కటాఫ్ డేట్‌గా నిర్ణయించి సర్వే చేస్తున్నారు. అంటే 2017 సంవత్సరం నాటికి 18 సంవత్సరాలు నిండిన వారినే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హులుగా పరిగణిస్తున్నారు. 2017 తరువాత నుండి ఇప్పటి వరకు 18 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణించడం లేదు. ప్యాకేజీ, పునరావాసం పూర్తయిన నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ అర్హులుగా గుర్తించాలి. వాస్తవంగా నేటికీ పోలవరం నిర్వాసితులకు పరిహారం, పాకేజీ, పునరావాసం పూర్తి కాలేదు. 2017 తరువాత 18 ఏళ్లు నిండిన వారి పరిస్థితి ఏమిటి? వారికి ఉండడానికి ఇల్లు ఉండదు. భవిష్యత్‌లో ఇల్లు నిర్మించు కుందామంటే స్థలం ఉండదు. ఆర్థికంగా డబ్బులు ఉండవు. దీంతో వీరందరూ మనో వేదనతో కుమిలిపోతున్నారు. చట్ట ప్రకారం నోటిఫికేషన్ వచ్చి మూడు సంవత్సరాలు దాటితే రీ నోటిఫికేషన్ ఇచ్చి పరిహారం ఇవ్వాల్సి ఉంది. ఇదే విషయాన్ని గతేడాది వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చింతూరు మండలం కల్లేరు గ్రామంలో చెప్పారు కూడా. కాని దానిని ఆచరణలో అమలు చేయడం లేదు. దీంతో యువతీ యువకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పునరావాసం పూర్తి చేసిన తేదీని కటాఫ్ డేట్‌గా పరిగణించి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించాలని, సిపిఎం నాయకులు, నిర్వాసితులు కోరుతున్నారు.

అర్హులకు పిఎం కిసాన్

జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్

ప్రజాశక్తి-పాడేరు

జిల్లాలో అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ పొందే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం నుండి తహశీల్దారులు, వ్యవసాయాధికారులు, సర్వేయర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఇంటింటి ఓటరు సర్వే, పివిటిజి ఓటరు సమోదు, పిఎం కిసాన్ ఆధార్ లింకేజి, భూముల రీ సర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్ ల్యాండ్లో పొందుపరిచిన రైతులందరికి పి.ఎం. కిసాన్ అందించాలని అన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతుల వివరాలు గిరి భూమిలో నమోదు. చేయాలన్నారు. రైతులందరికీ ఆధార్ సీడింగ్ చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు అందించాలని చెప్పారు. ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మృతి చెందిన ఓటర్లను పక్కాగా నిర్ధారణ చేసుకుని నోటీసు జారీ చేసి ఓటు తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఫారం 6,7,8, 11,11 ఎ, 110పై రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించారు. డోరు నెంబరు లేని 10 వేల మంది ఓటర్ల ఉన్నాయని ప్రతీ ఇంటికి డోరు నెంబరు వేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శుల పైనే ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులతో తహశీల్దారులు సమావేశం నిర్వహించాలని సూచించారు. నూరు శాతం పివిటిజి ఓటర్ల నమోదు చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ. పి.అంబేద్కర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌టిఎస్.నంద్, తహశీల్దారులు, సర్వేయర్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాస్



పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టిడిపి నాయకులు

యువగళానికి మద్దతుగా పాదయాత్ర

ప్రజాశక్తి- విఆర్.పురం

తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం విఆర్.పురంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, టిడిపి నాయకులు బొర్రా నరేష్, బీరక సూర్య ప్రకాష్‌రావు, పెందుర్తి సుదర్శన్‌రావు, పాయం సుబ్బారావు పాల్గొన్నారు.

రంపచోడవరం : యువగలం పాదయాత్రకు మద్దతుగా గురువారం రంపచోడవరంలోని స్థానిక ఏపీఆర్ఎస్ నుండి అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా పిఎంఆర్‌సి వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు వేణుగోపాల్ రాయుడు, 11 మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22 కేజీలు గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్కవరం జంక్షన్ వద్ద గురువారం 22 కేజీలు గంజాయి పట్టుబడింది. మోతుగూడెం పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం... గురువారం ఉదయం ఎస్ఐ, పోలీసు సిబ్బంది లక్కవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా సీలేరు డొంకరాయి, మోతుగూడెం మీదుగా మహారాష్ట్ర వెళ్తున్న మినీ వ్యాన్ తనిఖీ చేయగా, అందులో 22 కేజీల గంజాయి పట్టుబడింది. 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ లక్ష పదివేల రూపాయలు ఉంటుందని అంచనా. ఈ కేసులో ఒక ముద్దాయి పరారీలో ఉన్నారని, కేసును దర్యాప్తు చేస్తున్నామని మోతుగూడెం పోలీసులు తెలిపారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు



ఇంటింటి ఓటర్ సర్వేపై సమీక్ష నిర్వహిస్తున్న ఐటిడిఎపిఒ అభిషేక్

పక్కాగా ఇంటింటా ఓటర్ సర్వే : ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ :ఏజెన్సీలో ఇంటింటా ఓటర్ సర్వే పక్కాగా నిర్వహించామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు..ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అరకులోయ తహసిల్దార్ కార్యాలయంలో జనరల్ ఎలక్షన్‌కు సంబంధించి అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ మాట్లాడుతూ, కొత్తగా ఓటర్ నమోదు తొలగింపు, ఓటర్ కార్డు సవరణ చేయుటకు ఇంటింటా 80 శాతం సర్వే చేయగా తాత్కాలిక లిస్టు రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల రెండు వందల డబై రెండు ఓటర్లుగా లిస్టు తయారు చేశామని చెప్పారు. ఒకటి కంటే ఎక్కువ డూప్లికేట్ ఓటర్ కార్డు ఉన్న 215 ఓటర్ కార్డులను లిస్ట్ నుండి తొలగించామని చెప్పారు18000 పీవీటీజీల ఓటర్లను కొత్తగా ఓటర్ లిస్టులో నమోదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేపు కరెంటు బిల్లులు దగ్ధం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన కరెంటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1, 2 తేదీల్లో సచివాలయాల వద్ద సిపిఎం నిరసనలకు పిలుపునిచ్చిందని, ప్రజలు తమ కరెంటు బిల్లులను జెరాక్స్ తీయించి సచివాలయాల వద్ద దగ్ధం చేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. 'నాకు అధికారమివ్వండి... విద్యుత్ ఛార్జీలు పెంచను... మాట తప్పను.. మడమ తిప్పను..' అని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక మాట తప్పి, మడం తిప్పి ప్రజలపై కరెంటు ఛార్జీల భారం వేసారని, వాటికి తోడు సర్దుబాటు ఛార్జీలు, ఇంధన ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు పేరుతో ప్రజల నడ్డి విరిచే భారం వేసి వంచించారని విమర్శించారు. 2014, 2021లో వాడిన విద్యుత్‌కు నేడు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలపై రూ.4 వేల కోట్ల భారం వేసారని తెలిపారు. ఈ భారాలను ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ పంపిణీ రాష్ట్రాల పరిధిలోనిదని, రాష్ట్రాల హక్కు అయిన దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన కబంధహస్తాల్లోకి లాక్కొందని తెలిపారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి, తన మిత్రుడు అదానీకి సంపద పెంచే కుట్రలో మోడీ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల తయారీని అదానీ కంపెనీకి కట్టబెట్టిందని తెలిపారు. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించమని రాష్ట్రాలపై ఒత్తిడి తెలుస్తోందని, ఈ మీటర్లు వల్ల ప్రజలు, వినియోగదారులు, రైతులపై రాబోవు కాలంలో పెనుభారాలు పడతాయని వివరించారు. విద్యుత్ తయారీకి అయ్యే మొత్తం ఖర్చును ప్రజల నుంచి వసూలకు సిద్ధం చేస్తోందన్నారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఎగనామం పెడుతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను, ఫెడరల్ స్ఫూర్తిని హరిస్తుంటే, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఎదిరించకుండా అదానీ ప్రయోజనాల కోసం కేంద్రం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను వేగంగా అమలు చేసి ప్రభుభక్తిని జగన్ చాటుకుంటున్నారని విమర్శించారు. ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులందరికీ ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలుచేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం (ఎంఎన్‌ఎస్‌ఎస్) జిల్లా కన్వీనర్ ఈసర లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 880వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎంఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈసర లక్ష్మి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను, పద్ధతులను వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు.

అరకొర వేతనాలతో అవస్థలు



ఆందోళనలో పాల్గొన్న వివిఎలు (ఫైల్)

- మహిళా సంఘాలకు ఎన్నో సేవలు
- కానరాని కనీస వేతనం
- ఇదీ వివిఎల దుస్థితి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్వయం సహాయక సంఘాల్లో వివిఎల పాత్ర ఎంతో కీలకం. మహిళా అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్న వివిఎల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో 583 మంది వివిఎలు పని చేస్తున్నారు. గ్రామీణ పేద మహిళలను స్వయం సహాయక బృందాలుగా ఆర్గనైజ్ చేయడం వీరి బాధ్యత. పొదుపు సంఘాల కార్యకలాపాల్లో అట్టడుగు స్థాయిలో పనిచేసే గ్రామ సంఘ సహాయకులు. పొదుపు సంఘాల సభ్యుల్లో ఎక్కువమంది నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాల తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయడం, బ్యాంకు అధికారులతో మాట్లాడి పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం, కట్టించడం వంటి కీలక పనులను వివిఎలు నిర్వహిస్తున్నారు. గ్రామ సమాఖ్య పరిధిలో ఉండే సంఘాల వ్యవహారాలను వివిఎలు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో మహిళా సంఘాలకు సేవలు అందిస్తున్న వివిఎలకు (యానిమేటర్) ప్రభుత్వం అందిస్తున్న రూ.8 వేల వేతనం సరిపోవ లేదు. అరకొర వేతనంతో ఇబ్బంది పడుతున్నారు. వివిఎలను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నేటికీ నెరవేర్చలేదు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల పరిధిలో 583 మంది వివిఎలు పనిచేస్తున్నారు. వివిఎ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న అతి తక్కువ వేతనంతో వారి కుటుంబాలు గడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం పెడుతున్న నిబంధనలతో వివిఎలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల పరిమితి నిబంధనను అమల్లోకి తీసుకువచ్చి తొలగింపులకు పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వివిఎలకు హెచ్ఆర్ పాలసీని అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, వివిఎ మెర్జ్ లను వెంటనే ఆపి, కనీస వేతనం ఇవ్వాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. రాజకీయ వేధింపులు లేకుండా జెండర్ విధానాన్ని అమలు చేసి రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వం పట్టించుకోలేదు. మూడేళ్ల కాల పరిమితి రద్దు చేసి 15 సంఘాల లోపు ఉన్న వివిఎల వేతనాలు చెల్లించాలని, వయసు, చదువు, జెండర్‌తో సంబంధం లేకుండా వివిఎలను కార్యకర్తలుగా గుర్తించాలని ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం కనికరించట లేదు. వివిఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే, రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేయక తప్పదని వివిఎలు హెచ్చరిస్తున్నారు.

వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

వివిఎలకు గౌరవ వేతనాన్ని నెలకు రూ.26 వేలు ఇవ్వాలి. ప్రభుత్వం ఇస్తున్న అతి తక్కువ వేతనంతో కుటుంబాలు గడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిఎలకు ఇచ్చే గౌరవ వేతనం ఎంఎస్ అకౌంట్ లలో వేయడం ఆపాలి. వేతనాలు చెల్లింపు చెక్కులపై సిసి, ఎపిఎం సంతకాలు లేకుండా చూడాలి. రికవరీ పేరుతో వేతనాల కోత విధించడం ఆపాలి. ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. వివిఎల తొలగింపు చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. వయసు పైబడిన, అనారోగ్యంతో ఉన్న వివిఎల కుటుంబ సభ్యులకు వివిఎలుగా అవకాశం కల్పించాలి.



బి.చిన్నయ్య పడాల్
సిఐటియు జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి..

వివిఎలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. వివిఎ ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి. వివిఎలకు అన్ని రకాల బకాయిలు చెల్లించాలి. 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలి. వివిఎలకు గ్రామ సమాఖ్య మెర్జ్ ఆపాలి. ఆపాలి కోల్పోయిన వివిఎలకు నష్టపరిహారం చెల్లించాలి. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు, వివిఎలకు టార్గెట్లు ఉండకూడదు. లింగం, వయస్సు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలి.



ఆర్.భాను
వివిఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు

ఘనంగా రక్షాబంధన్

ప్రజాశక్తి-పాడేరు:రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం ఊరువాడ పట్టణంలో సోదరి సోదరులు తమ అన్నా చెల్లెళ్ల అక్క తమ్ముళ్ల అనురాగాన్ని పంచుకుంటూ ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యాలయాల్లో యువతి యువకులు రాఖీలతో సందడి చేశారు. పట్టణంలోని ఓం శాంతి సభ్యులు తమ ఆశ్రమంలో రాఖీ పౌర్ణమి రక్షాబంధన్ ఆవశ్యకతను వివరిస్తూ సోదర భావంతో అందరికీ రాఖీలు కట్టి సోదర సౌభ్రాతృత్వాన్ని చాటి చెప్పారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, ఏఎస్పి ధీరజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగ్ రావు, ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అధికారులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఓం శాంతి సభ్యులు విజయ శారద శాంతి, ఆధ్యాత్మిక సభ్యులు కాశిమ్మ ఈశ్వరి సునీల తదితరులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

డుంబ్రిగుడ: రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకొని గిరిజనులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు, అక్క చెల్లెలు రాఖీలను కట్టి, స్వీట్లు తినిపిస్తూ ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రాఖీ పండుగను నిర్వహించుకోవడంతో సందడిగా కనిపించింది.



పిఒకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

'గంగవరం' సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమస్యలపై రెండు నెలలుగా గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న ఆందోళనకు పరిష్కార మార్గం సుగమమైందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోర్టు కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ వివరాలు వెల్లడించారు. విధుల నుంచి యాజమాన్యం సస్పెండ్ చేసిన ఐదుగురు కార్మికులను ఎటువంటి కండిషన్ లేకుండా తిరిగి విధులలోకి తీసుకోవడం, ప్రమాదంలో మరణించిన కార్మికులకు గతంలో ఉన్న రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.25 లక్షలు చెల్లించేందుకు, 2024 ఏప్రిల్ 1వ తేదీన మంజూరుచేసే వార్షిక ఇంక్రిమెంట్‌తో అదనంగా రూ.1500 చెల్లించుటకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్మికులు మెడికవర్, కేర్, అపోలో, గాయిత్రి విద్యా పరిషత్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేలా హెల్త్ కార్డులను మంజూరు చేస్తారని చెప్పారు. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో రూ.10 వేలు బోనస్‌గా చెల్లించనున్నట్లు వివరించారు.

ప్రస్తుతం ఆందోళన చేస్తున్న కార్మికులకు పై అంశాలకు సంబంధించి రాత పూర్వకంగా ప్రోసీడింగ్ రూపంలో శుక్రవారం ఉదయం అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సిఎం.త్రివిక్రమవర్మ, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిసిపి ఆనందకుమార్‌రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి హుసేన్ సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి కళాభారతి జాతీయ సంగీత నృత్య నాటకోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంస్థ 37వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 7 వరకూ ప్రఖ్యాతి గాంచిన సంగీత కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని కళాభారతి సంస్థ కార్యదర్శి జిఆర్‌కె.ప్రసాద్ (రాంబాబు) తెలిపారు. ఈ సందర్భంగా వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యా భారతి పురస్కారం అందించనున్నట్టు చెప్పారు. గురువారం కళా భారతి ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ గత 36 సంవత్సరాలుగా కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు సహాయం చేస్తూ వస్తోందన్నారు. ఈ సంవత్సర వార్షికోత్సవాలను పురస్కరించుకుని జాతీయ సంగీత, నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ పురస్కారంగా బహుమతి రూ.లక్ష, ప్రశంసా పత్రం, నూతన వస్త్రాలు, రూ. 2 లక్షలు విలువ చేసే స్వర్ణ కమలం, ప్రతిష్టాత్మకమైన "నాద విద్యా భారతి" బిరుదుతో సత్కరించనున్నట్లు వివరించారు. 2వ తేదీ సాయంత్రం 6 గంటల కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా భారత పూర్వ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్య నాయుడు, నావికా దళ వైస్ అడ్మిరల్ జి. శ్రీనివాసన్ హాజరుకానున్నట్టు చెప్పారు. అన్ని కార్యక్రమాలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాలు ఆహ్వాన పత్రికను అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు, కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సింధూరి గ్రంధి, మోహన్ దాస్ విడుదల చేశారు.

అడవిని, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చట్ట సవరణలు రద్దుచేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : అడవిని, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన చట్ట సవరణను రద్దుచేయాలని ఎఐకెఎంకెఎస్ కో-కన్వీనర్, రైతు కూలీసంఘం ఎపి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ డిమాండ్ చేశారు. అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఎఐకెఎంకెఎస్, రైతు కూలీసంఘం ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ, గత పార్లమెంట్ సమావేశాల్లో ఆదివాసీ హక్కులను, జీవితాలను, దేశ పర్యావరణాన్ని హరించే అటవీ సంరక్షణ సవరణ, జీవ వైవిధ్య సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇవి అమలైతే గిరిజన ప్రాంతంలో లక్షలాది మంది గిరిజనులు అడవి నుంచి గెంటేయబడతారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మైనింగ్ మాఫియాకు అడ్డూ అదుపూ లేకుండా పోతుందన్నారు. గిరిజన రైతాంగ పోరాటల ఫలితంగా గిరిజనులు సాధించుకున్న 1/70, పీసా చట్టాలు నిర్వీర్యమైపోతున్నాయన్నారు. 'గ్రామ సభల 'హక్కులు' 'మా వూరులో మా రాజ్యం' తదితరాలు ఈ చట్ట సవరణతో రద్దవుతాయని చెప్పారు. కనుక ఈ చట్ట సవరణలను రద్దు చేయాలని ఆదివాసీలు, రైతాంగం, ప్రజాతంత్ర శక్తులు పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఎఐకెఎంకెఎస్ అఖిల భారత ఆదివాసీ సదస్సును విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఝాన్సీ తెలిపారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్ పండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన ఖరీఫ్ సాగు విస్తీర్ణం

60శాతానికి తగ్గిపోయిన వరి సాగు

వర్షాభావ పరిస్థితులే కారణం

వ్యవసాయశాఖ విశాఖ జెడి అప్పలస్వామి

ప్రజాశక్తి -మధురవాడ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల్లో విశాఖపట్నం జిల్లాలో ప్రధాన వరిపంటతోపాటు ఇతర పైర్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ అప్పలస్వామి తెలిపిన వివరాలివి.

ఏటా ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 5575 హెకార్లు సాధారణ సాగువిస్తీర్ణం కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 3155 హెక్టార్లలో సాగుబడిలోకి వచ్చింది. అందులో 4599 హెకార్లలో వరిసాగుకు గాను 2751 హెక్టర్లలో నాట్లు పడ్డాయి. 60 శాతం వరిసాగు నమోదైంది. సజ్జలు 71 హెక్టార్లకుగాను 37 హెక్టార్ల (52శాతం)లో వేరుశనగ 112 హెక్టర్లకు గాను 23 హెక్టార్ల(20.5శాతం)లో నువ్వులు 544హెక్టార్లకు గానున 324 హెక్టార్లు (60శాతం)లో సాగు చేసినట్లు తెలిపారు మండలంలో ఇంకా 2420ఎకరాల పంటభూమి వర్షాభావం, ఇతరత్రా పరిస్థితుల కారణంగా సాగుకు దూరంగా ఉందన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో.జిల్లాలో 2194 క్వింటాళ్ల వరి విత్తనాలు, 125.28 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 34.6 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేశామన్నారు. 1094 టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో యూరియా 646 మెట్రిక్ టన్నులు, డిఎపి 392 మెట్రిక్ టన్నులు, పొటాష్ 54 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 91 మెట్రిక్ టన్నులు, సింగల్ సూపర్ ఫాస్ఫేట్ 111 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు..రైతు భరోసా కేంద్రాలలో యూరియా 180 మెట్రిక్ టన్నులు, డిఎపి 108 మెటిక్ర్ టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు.

కృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థుల ఔదార్యం

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు రూ.2.44లక్షల వితరణ



నగదు సాయం చెక్కును అందజేస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఆరిలోవ :ఆరిలోవ ప్రాంతంలోని చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు ఆదర్శనగర్ శ్రీకృష్ణా గ్రామర్ స్కూలు విద్యార్థులు రూ.2.44 లక్షల వితరణ అందించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరిలోవ సిఐ సోమశేఖర్ పాల్గొని చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ విశాఖపట్నం ఇన్‌చార్జ్ సూర్య లక్ష్మీకి విద్యార్థులు సేకరించిన రూ.2,44,552ల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా సిఐ సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవాభావాన్ని అలవాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న పాఠశాల అధినేత మునికృష్ణ, ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అధినేత మునికృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సమకూర్చిన నగదును పేద పిల్లల చదువుకు వినియోగించాలని కోరారు. చైల్డ్‌హెల్ప్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ సూర్యలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉదారంతో ఇచ్చిన ప్రతిపైసాను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్నారు.

న్యాయం జరగని చట్టాలపై నమ్మకం పోతోంది!



ఉండవల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : న్యాయం లేని చట్టాలపై నమ్మకం లేని రోజులు ప్రస్తుతం నడుస్తున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు గురువారం పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న చెడును ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కోర్టులో గానీ, స్టేషన్‌లో గానీ బాధితులకు ఎక్కడా న్యాయం జరగడం లేదన్నారు. న్యాయం కోసం బాధితులు కోర్టుకెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఓట్లు కోసం రాజకీయాలు చేస్తున్నారే తప్ప, ప్రజలకు మంచి పాలన అందించే మంచి నాయకుడు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఒకప్పుడు రాజకీయాలంటే, సొంత ఆస్తులను ఖర్చు చేసేవారని, ఇపుడు ఖర్చుచేసిన దానికి ఎన్నింతలు సంపాదించాలనే ఉద్దేశంతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాగని చట్టాలు, న్యాయంపై నమ్మకం పోవడం సరికాదని, చెడును ప్రశ్నిస్తే, ఎక్కడో ఒక దగ్గర తప్పక న్యాయం జరుగుతుందన్నారు.సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రతినిధులు ప్రసన్నకుమార్ మధుకుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రితు సాహు కేసులో పెరుగుతున్న అనుమానాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో మృతిచెందిన బెంగాల్ విద్యార్థిని రితు సాహు కేసులో కొత్త ట్విస్ట్ నెలకొంది. ఘటన జరిగిన 15 రోజుల తర్వాత ఈ కేసును అనుమానస్పద మృతిగా పోలీసులు మార్చారు. బాలిక మృతిపై రోజురోజుకూ అనుమానాలు పెరుగుతున్నాయి. ఈ కేసులోకి బెంగాల్ పోలీసులు విచారణ చేపట్టాక మొత్తం కేసు మారిపోయింది. ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదంటూ విద్యార్థిని తల్లితండ్రులు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలని పోలీసులకు మమతా ఆదేశాలు జారీ చేశారు. కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో విశాఖలో విద్యార్థిని హత్యకు గురైనట్లు గతంలో సెక్షన్ 302 కింద కేసు నమోదైంది. ఫోర్త్ టౌన్ పోలీసులు కేసు విచారణలో అనేక లోపాలున్నాయని బెంగాల్ సిఐడి గుర్తించారు. కోర్టు ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు వెస్ట్ బెంగాల్ సిఐడి అధికారులకు సహకరిస్తున్నారు.

అనుమానాస్పద మృతిగా నమోదు

విచారణలో భాగంగా విశాఖకు చేరుకున్న బెంగాల్ సిఐడి పోలీసులు హత్యా కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ యాజమాన్యం, బైజుస్ ఆకాశ్ సంస్థ, వైద్యం అందించిన ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం, వారి పాత్రపై విచారణ మొదలు పెట్టారు. అనంతరం ఓ నిర్ధారణకు వచ్చాక గురువారం రితు సాహు మృతిపై సెక్షన్ 174 నుంచి ఐపిసి 304 పార్ట్ 2గా మార్చారు. ఫోరెన్సిక్ రిపోర్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. రిపోర్టు ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగనుంది. ఇన్ని రోజులు రితు సాహుది ఆత్మహత్యగా భావించిన విశాఖ పోలీసులు అనుమానస్పద మృతిగా సెక్షన్ 174 ఐపిసి కింద కేసు నమోదు చేశారు. కాలేజీ, హాస్టల్ యాజమాన్య నిర్లక్ష్యంగా ఉన్నట్టు విచారణలో పోలీసులు గుర్తించారు. రెండో రోజు దర్యాప్తులో భాగంగా సాధన హాస్టల్, వెంకటరమణ హాస్పిటల్‌లో సీసీ కెమెరాలు, రికార్డులు పరిశీలించారు.

పలు అనుమానాలు

విద్యార్థిని రితు సాహు ఆస్పత్రిలో ఉన్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కింద పడిన తర్వాత ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించింది బై జూస్ యాజమాన్యం. విద్యార్థిని శరీరంపై బలమైన గాయాలు ఏమీ కనిపించలేదు. బలమైన గాయాలు లేకపోవడం, మృతికి దారి తీసిన కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రీట్‌మెంట్ చేస్తున్న సమయంలో వైద్యులకు సహకరించకుండా రితు అడ్డుకోవడం కనిపించింది.

ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఏటా ఆగస్టు 29న ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ద్విభాషా ఇంగ్లీష్-ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు కొత్త ఎడిషన్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆక్స్ ఫర్డ్ ప్రెస్ ఇండియా హెడ్ సుమంత్ దత్తా అన్నారు. గురువారం సిరిపురంలోని వుడా చిల్డ్రన్ ఏరినలో జరిగిన కార్యక్రమంలో ఈ కొత్త ఎడిషన్‌ను ప్రాంభించారు. ఈ నూతన ఎడిషన్‌లో 3,000 కొత్త పదాలను చేర్చి, ఆక్స్ ఫర్డ్ కాంపాక్ట్‌ను అందుబాటులోకి తెచ్చిందని సుమంత్ దత్తా తెలిపారు. ఇంగ్లీష్-ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ 27,000పైగా పదాలు, పదబంధాలు, సామెతలు లాంటి వాటిని తెలుగులో వాటి వివరణాత్మక అనువాదాలను కలిగి ఉందన్నారు. ఇది 1,100 కంటే ఎక్కువ పర్యాయపదాలు, వ్యతిరేక పదాలను కలిగి ఉందని వివరించారు. ఆంగ్లంలో తెలుసు కోవలసిన అత్యంత ముఖ్యమైన 2,000 కీలకపదాలు ఉన్నాయని తెలిపారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు ఇందిరానగర్‌లో రూ.34 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జివిఎంసి కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గురువారం శంకుస్థాపన చేశారు. అప్పాజీ టవర్స్ వద్ద సిసి రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు రిపేర్లు, ప్యాచ్ వర్క్స్, అలాగే బాలాజీ నగర్‌లో సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణం, సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు.. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పక్షవాతంలో బాధపడుతున్న ఒక వ్యక్తికి తన సొంత నిధులతో ప్రతినెలా పింఛను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా నేతలిద్దరికీ స్థానిక మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, డిఇ విజయ్ కుమార్, ఎఇ. వెంకటలక్ష్మి, వైసిపి వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, బురెడ్డి గోపి, కంపర కోటేశ్వరరావు, ఊటపల్లి గోవిందు, కొమనాపల్లి త్రినాథ్, మార్కండేయ రాజశేఖర్, ధర్మ, కామేష్, వెంకటరావు, జీవి రమణ, అర్జున్ రావు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, కిషోర్, కోనేటి శ్రీను, భాను, లతీఫ్, కోటి, ప్రకాష్, తుంపాల శ్రీను, బలిరెడ్డి శ్రీను, కుమార్, వాసు, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇల్లపు రమణ, ఆచారి, సురేష్, కేబుల్ శేఖర్, రేణుక తదితరులు పాల్గొన్నారు

సన్‌ఫార్మా ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల్లో గీతం విద్యార్థులకు ప్రాధాన్యత

గీతంలో సన్‌ఫార్మా గ్లోబల్ హెడ్ పల్లె వెంకటా సందర్శన



సన్‌ఫార్మా గ్లోబల్ హెడ్ పల్లె వెంకటను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు తమ ఔషధ సంస్థలో ఇంటర్న్‌షిప్‌లతో పాటు వివిధ విభాగాలలో ఉద్యోగావకాశాలపై ప్రాధాన్యత ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ప్రముఖ ఔషధ తయారీ సంస్థలలో ఒకటైన సన్ ఫార్మా రీసెర్చి సెంటర్ గ్లోబల్‌హెడ్ డాక్టర్ పల్లె వెంకట అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, సైన్స్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ కృష్ణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, రసాయన శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావులతో సమావేశమయ్యారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనశాస్త్ర విభాగం పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఔషధ పరిశోధనలలో వస్తున్న మార్పులు, నూతన ఔషధాల

యువతి అదృశ్యం



అదృశ్యమైన గౌతమి

ప్రజాశక్తి -మధురవాడ: పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు.సిఐ తెలిపిన వివరాల మేరకు, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న కొమ్మాది జయంతినగర్‌కు చెందిన యువతి గౌతమి (17) ఈ నెల 28న కళాశాలకు వెళ్ళింది. సాయింత్రం ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులు ఇళ్లల్లో ఆచూకీ తీశారు. మిత్రులతో కలిసి కొమ్మాది కూడలిలోని థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లినట్లు తెలిసిందని, తర్వాత కనిపించకుండా పోయిందని యువతి తల్లి జయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఎస్‌ఐ శ్యాంప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సిఐ రామకృష్ణ తెలిపారు.

వివాహితపై హత్యాయత్నం భర్త, అత్తకు రిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ : భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను, అతనికి సహకరించిన తల్లిని ఆరిలోవ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివి.

నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన వాసుపల్లి ప్రసాదుకు, ఆరిలోవ ప్రాంతానికి చెందిన నీలమతో వివాహం అయ్యింది. కొంతకాలంగా అనుమానంతో భార్య నీలిమను ప్రసాద్ వేధిస్తున్నాడు. దీంతో భర్తతో గొడవ పడి, కొన్నాళ్లుగా ఆరిలోవలోని తన కన్నవారింటిలో నీలిమ ఉంటుంది. బుధవారం నీలిమ భర్త ప్రసాదు, అత్త వాసుపల్లి ముత్యాలమ్మ ఆరిలోవలో ఉంటున్న కోడలు ఇంటికి వచ్చారు. తల్లి సమక్షంలోనే భార్య నీలిమపై ప్రసాద్ బ్లేడుతో దాడి చేసి పరారయ్యాడు. దీనితో నీలిమకు ముఖంపైనా, మెడపై తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నీలిమ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిఐ సోమశేఖర్ కేసు నమోదు చేశారు. పరారీలోనున్న నీలిమ భర్త ప్రసాద్, అంత్త ముత్యాలమ్మను బుధవారం అదుపులోకి తీసుకొని గురువారం రిమాండుకు తరలించారు.